## తొలకరి చినుకులు

"యువతా! కాపాడుకో ని భవిత! " అని పొలికేక పెడుతూ ముందు నిన్ను నువ్వు సరిదిద్దుకో తరువాత ఈ సమాజాన్ని తీర్చిదిద్దు! అంటూ సున్నితంగా హెచ్చరిస్తూ రచయిత తన అక్షర తూణీరం నుండీ ఒక శరాన్ని యువత గుండెకు గురిచూపి సంధించి విడచిన అస్త్రమే ఈ పుస్తకం.

పాలకుల వల్ల గానీ, పెద్దల వల్ల కానీ, ఈ సమాజం చైతన్యవంతం కాదనీ, అది ఒక్క యువతకే సాధ్యమనీ, దిశా, నిర్దేశం కలిగించే ఎన్నో ఉదాహరణలు వివరిస్తూ, తగు సాక్ష్యాధారాలు చూపుతూ, నేటి యువతను ఈ రచన ద్వారా ఉత్తేజ పరచడంలో రచయిత కృతకృత్యుడయ్యాడనడంలో సందేహం లేదు.

జీర్ణపర్ణమైన నేటి సమాజ దుస్థితిని కళ్ళారా చూస్తూ, పెడదారులు పడుతున్న యువత తీరుతెన్నులు గమనిస్తూ - "ఆకాశం బద్దలైయ్యేట్టు ఏడ్వాలని పిస్తుందని రచయిత తన అంతరాంగాన్ని నిజాయితీగా నిర్మోహమాటంగా ఆవిష్కరించిన విధానం సామాన్య పాఠకునికి కూడా స్పందన కలిగించక మానదు.

ఈ సమాజాన్ని ఆదర్శప్రాయంగా ఉన్నత శిఖరాలకు చేర్చినా, అధః పతనానికి దిగజార్చినా, దానికి కారణం మూమ్మాటికీ యువతరమేనని రచయిత ప్రగాఢంగా విశ్వసించడం ఈ పుస్తకం ద్వారా పాఠకలోకానికి బోధపడుతఠఱఉ ంది.

దేశంలోని యువతంతా మతాల కతీతంగా, పార్టీల కతీతంగా, కులాల కతీతంగా, సంఘటితమై ఈ సమాజాన్ని ఒక్క త్రాటిపై నడిపించగల శక్తి సామర్థ్యాలను ప్రదర్శించమని పదే పదే గుచ్చి గుచ్చి యువతను అభ్యర్థించడం రచయిత యొక్క సహజ సిద్ధమైన త్యాగనిరతికి నిజంగా నిలువెత్తు నిదర్శనం.

సామాజకి రచనా శిల్పిగా సత్కరింపబడిన కేకలతూరి క్రిష్ణయ్య గారు ఇప్పటి వరకూ దాదాపు 17 గ్రంథాలను రచించి పాఠకలోకానికి అందించారు. ఆ పుస్తకాలతో పాటు క్రిష్ణయ్య గార్ని కూడా కొంత చదివినందువల్ల ఆయన వ్యక్తిగత విషయాలను సంక్షిప్తంగా పాఠకులకు తెలియజేయడం ఆదర్శప్రాయంగా

భావిస్తున్నాను. మా ఇరువురి మధ్య మైత్రికి మైనార్టీ తీరిపోయినా మా సన్నిహిత సహచర్యం దైనిక చునర్యలా కొనసాగుతూనే వుంది.

ఒక చరిత్ర కారుడు తాను చూపించిన చిత్రాలలో తన పోలికలు ఎక్కడో ఒక చోట కనిపించడం సహజం. అలాగే తన రచనలపై తన మనస్తత్వ ప్రబావం పొడచూపడం తప్పనిసరి. మిత్రులు క్రిష్ణయ్య గారి మనుగడ సాంప్రదాయ బద్దం గానూ, సామాజిక స్పృహలోనూ, త్యాగ నిరతిలోనూ, కొనసాగుతూ వుంటుంది. అందువల్లనే స్నేహహస్తం అనే స్వచ్ఛంద సంస్థను మిత్రుల సహకరాంతో స్థాపించి అనాధలకు, రోగులకు, విద్యార్ధులకు విద్య, వైద్య, వస్త్ర దానాలు చేసిన సందర్భాలు అనేకం. ఆ జిజ్ఞాస వున్నందువల్లే ఆయన ప్రతి పుస్తకంలోనూ, ప్రతి పేజీలోనూ, భారతీయ సాంప్రదాయం ప్రతిబింబిస్తూ వుంటుంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆయన రచనకు ఈ సమాజమనే వేదానికి భాష్యాలు.

మన భారతీయ సత్సాంప్రదాయాలను సజీవంగా కాపాడుకోవాలనే బాధ్యత ప్రజలపైన, ప్రభుత్వంపైనా వున్నప్పుడే దేశం ఆదర్శప్రాయంగా ప్రగతి పథంలో పయనిస్తుందనే సందేశం రచయిత ఈ పుస్తకం ద్వారా అంతర్లీనంగా తెలియ జేయడం హర్షనీయం.

మిత్రులు క్రిష్ణయ్య గారు ఇంకా ఇల్లాంటి ప్రయోజనాత్మక రచనలు వ్రాయాలని, ఆశక్తిని భగవంతుడు కలుగజేయాలని మనసారా కోరుకుంటూ. . .

**అభినందనలతో . . .**

**నటసిద్ధాంతకర్త**

**రాజా శివానంద**

**సినీ రచయిత**

**హైదరాబాద్.**